సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 5 । ఆగస్టు । 2023



సోమశిలలో 23.94 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారానికి 23.94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 647 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,140
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,491
మూడు శాతం జీఎస్టీతో..	రూ.5,656
నవర (8 గ్రాములు)	రూ.45,248

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /28.6

వాతావరణం

వాతావరణంలో తేమ 43 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా తేలికపాటి జల్లులు శనివారం కురుస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ @ 97.89 శాతం



నెల్లూరులో యశోదమ్మకు నగదును అందజేస్తున్న వలంటీర్ యామాలమ్మ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సాగుతోంది. నాలుగో రోజు శుక్రవారానికి 97.89 శాతం మంది లబ్ధిదారులకు నగదును పంపిణీ చేశారు. 3,03,501 మందికి గానూ 2,97,107 మందికి అందజేశారు.

అప్పారావుపాళెం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

ఆత్మకూరు రూరల్: అప్పారావుపాళెం సర్పంచ్ సోమా కుమారి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశాలను శుక్రవారం జారీ చేశారు. గ్రామంలో గతేడాది వరదలొచ్చిన సమయంలో కలెక్టర్ ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన పనులకు ఆలస్యంగా బిల్లులు చేయడం.. గ్రామంలో పారిశుధ్య పనులు.. వీధి లైట్ల మరమ్మతులు, తదితర కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి రికార్డుల్లేకపోవడం.. తదితరాలపై ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ప్రాథమిక విచారణ అనంతరం మూడు నెలల పాటు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 15 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో తదుపరి క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

నలుగురు ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. నవాబుపేట ఎస్సై తిరుపతయ్యను కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు.. కావలి ఒకటో పట్టణ ఎస్సై ఆదిలక్ష్మిని జలదంకికి.. అక్కడ పనిచేస్తున్న వీరేంద్రబాబును నవాబుపేటకు, పీసీఆర్ ఎస్సై త్యాగరాజును డీసీఆర్బీకి బదిలీ చేశారు. వీరు వెంటనే తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



సమస్యలపై ఆరాతీస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిందిగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సిబ్బంది శుక్రవారం నిర్వహించిన కవాతును పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజూ వ్యాయామం, యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం ఉంటుందన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్ర సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్‌ను నిర్వహించారు. వ్యక్తిగత, ఆరోగ్యపరమైన, విధుల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ అడ్మిన్, క్రైమ్స్, ఏఆర్ హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ‘ఇండియా’లో చేరాలి



మాట్లాడుతున్న జగదీష్

ఆత్మకూరు: ప్రతిపక్ష నేత చంద్రబాబు తక్షణమే ఇండియా కూటమిలో చేరాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ కోరారు. సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించేందుకు దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఏకతాటిపై నడుస్తున్నాయని తెలిపారు. తొలుత సీపీఐ జెండాను జిల్లా నేత బలిజేపల్లి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. పార్టీ నేతలు అంకయ్య, కుమార్‌రెడ్డి, అరిగెల నాగేంద్రసాయి, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు భరోసా



వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా ఈ ఏడాది రూ.40.26 కోట్లు

- ఎస్‌హెచ్‌జీల బ్యాంక్ ఖాతాల్లో ఈ నెల పదిన జమ
- నాలుగేళ్లలో రూ.202.35 కోట్ల మేర లబ్ధి

స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వడ్డీ లేని రుణాలను గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయకపోవడంతో ఎస్‌హెచ్‌జీలు నానా పాట్లు పడ్డారు. ఈ క్రమంలో వీరికి ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు.

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఎస్‌హెచ్‌జీల ఆర్థికాభివృద్ధికి గడిచిన నాలుగేళ్లలో రూ.202.35 కోట్ల సున్నా వడ్డీ రుణాలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 33,869 స్వయం సహాయక గ్రూపులకు వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.40.26 కోట్ల లబ్ధి చేకూరనుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల పదిన బటన్ నొక్కి ఈ మొత్తాన్ని గ్రూపు మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు.

గత ప్రభుత్వంలో నిలువునా ముంచారు

స్వయం సహాయక గ్రూపు మహిళలకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం పక్కనబెట్టి ప్రచారం కోసం పాకులాడింది. తీసుకున్న రుణాలను ఎవరూ చెల్లించొద్దని.. తాము అధికారంలోకి వచ్చాక బ్యాంక్ లింకేజీ రుణాలను రద్దు చేస్తామని 2014 ఎన్నికల సమయంలో టీడీపీ ప్రచారం చేసింది. దీన్ని విశ్వసించిన మహిళలు రుణాలను తిరిగి చెల్లించలేదు. అయితే అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించి ఎస్‌హెచ్‌జీలను నిలువునా ముంచారు. తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించాల్సి వచ్చింది. అవసరానికి రుణాలు అందక మహిళలు నానా ఇబ్బందులూ పడ్డారు.

నేడంతా ఆనందమే..

ఎస్‌హెచ్‌జీలు పడిన కష్టాలను గమనించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీరికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వీరి ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేశారు. ఎస్‌హెచ్‌జీలకు వందల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను ఏటా మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రూ.1273 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.1031 కోట్ల వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.రెండు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వ్యక్తిగత రుణాలను మంజూరు చేసేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న అధికారులు (ఫైల్)

44,210 సహాయక గ్రూపులు

జిల్లాలో 44,210 స్వయం సహాయక గ్రూపులు.. ఇందులో సుమారు ఐదు లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరి ఆర్థిక స్వావలంబనకు బ్యాంక్ లింకేజీ రుణాలను ఏటా మంజూరు చేస్తున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొంది.. వాటిని తిరిగి సక్రమంగా చెల్లించే గ్రూపులకు మాత్రమే వడ్డీలేని రుణాలు వర్తిస్తాయి. రుణాలు తీసుకున్న మహిళలు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లిస్తారు. వీరు చెల్లించిన వడ్డీని తిరిగి వారి పొదుపు ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తోంది.

ఆర్థిక సంవత్సరం	ఎస్‌హెచ్‌జీలు	జమైన నగదు (కోట్లలో)
2019 - 20	29,310	రూ.58.73
2020 - 21	32,894	రూ.50.75
2021 - 22	34,238	రూ.52.61
2022 - 23	33,869	రూ.40.26

హామీని అమలు చేశారు



ఎన్నికల సమయంలో స్వయం సహాయక మహిళలకు ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15,839 మేర సున్నా వడ్డీ బ్యాంక్ ఖాతాలో జమ కానుంది. సీఎంకు కృతజ్ఞతలు.

– రహిమా, బోడిపాడు, చేజర్ల మండలం

రూ.17,500 లబ్ధి చేకూరనుంది



ఇచ్చిన మాట మేరకు సున్నా వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.17,500 సున్నా వడ్డీ విడుదలైంది. ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎంకు ధన్యవాదాలు.

– సుభాషిణి, టీకేపాడు, చేజర్ల మండలం

గతంలో రుణాలు మంజూరు చేయలేదు



వడ్డీలేని రుణాలను గతంలో మంజూరు చేయలేదు. రుణాలను సక్రమంగా చెల్లించినా.. ఎలాంటి ప్రయోజనం ఉండేది కాదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం సున్నా వడ్డీని ఠంచన్‌గా విడుదల చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10,521 సున్నా వడ్డీ బ్యాంక్ ఖాతాలో జమ కానుంది.

– వహీదా, బోడిపాడు, చేజర్ల మండలం

పదిన జమ



ఎస్‌హెచ్‌జీలకు సున్నా వడ్డీని ఈ నెల పదిన ప్రభుత్వం విడుదల చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 33,869 గ్రూపులకు రూ.40.26 కోట్ల సున్నా వడ్డీని వారి బ్యాంక్ ఖతాల్లో జమచేయనున్నారు. ఎస్‌హెచ్‌జీల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతోంది.

– సాంబశివారెడ్డి, డీఆర్డీఏ పీడీ

ఫలరాజుపై వేటు



- పండు ఈగను ఎదుర్కోలేక చేతులెత్తేస్తున్న రైతులు
- ఏళ్ల నాటి మామిడి తోటలను నరికేస్తున్న వైనం
- 15 రోజుల వ్యవధిలో వందెకరాలకు పైగా తోటల తొలగింపు
- కందుకూరు, గుడ్లూరు మండలాల్లో ఇదీ పరిస్థితి



కందుకూరు: ఉలవపాడు మామిడి అంటేనే ఓ బ్రాండ్. రుచి, నాణ్యతకు మారుపేరైన ఈ ప్రాంత మామిడికాయను ఇష్టపడని వారుండరు. రాష్ట్రంలోనే కాకుండా విదేశాల్లోనూ వీటికి ఉండే డిమాండే వేరు. అంతటి ప్రఖ్యాతి గాంచిన మామిడి తోటలను పండు ఈగ అనే పురుగు సర్వనాశనం చేస్తోంది. దీన్ని ఎదుర్కోలేక రైతులు ఏకంగా తోటలనే తొలగించేస్తున్నారు. ఒక్క గొడ్డలి వేటుతో ఏళ్ల నాటి చెట్లను నిలువునా నరికేస్తున్నారు. కందుకూరు, గుడ్లూరు మండలాల్లో 15 రోజులుగా ఈ తంతు కొనసాగుతోంది.

తెగుళ్లను ఎదుర్కోలేక

కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో పండే మామిడికాయలను ఉలవపాడు మామిడి అంటారు. ఈ ప్రాంతంలోని ఇసుక, ఎర్ర నేలల్లో పెరిగే ఈ మామిడి అంతా ఒకటే రుచి ఉంటుంది. దాదాపు 15 వేల ఎకరాల్లో తోటలు సాగులో ఉన్నాయి. అయితే తెగుళ్ల ఉధృతిని రైతులు రెండేళ్లుగా ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పండు ఈగ, టెంకపురుగు మామిడిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. వీటి ధాటికి దిగుబడి తగ్గడంతో పాటు కాయ నాణ్యతా దెబ్బతింటోంది. పైకి నిగనిగలాడుతూ కనిపిస్తున్నా.. కోసి చూస్తే లోపల మాత్రం పురుగే ఉంటోంది. ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నుల దిగుబడి రావాల్సిన తోటల్లో తెగుళ్ల ధాటికి ఒకట్రెండు టన్నుల దిగుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఈ పురుగును ఎదుర్కొనేందుకు వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగిపోయాయి. దిగుబడి పూర్తిగా పడిపోవడం.. నాణ్యత లేదనే కారణంతో కాయలను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడం రైతులకు తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో పాలుపోక మామిడి తోటలను నరికేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

మిర్చి, పొగాకు, జామాయిల్ వంటి పంటల సాగుతో రైతులు అధిక ఆదాయాలు పొందుతున్నారు. దీంతో మామిడిని తొలగించి వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. ఇసుక నేలల్లో మిర్చి సాగు చేసుకుంటామని, జామాయిల్ వేసినా పెట్టుబడి లేకుండా ఆదాయాలొస్తాయని రైతులు చెప్తున్నారు. ఈ ఆలోచనతో మామిడి తోటలను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారు.

నేలకొరుగుతున్న ఏళ్ల నాటి చెట్లు

కందుకూరు, గుడ్లూరు మండలాల్లో మామిడి చెట్ల నరికివేత కొనసాగుతోంది. ఉద్యానాధికారుల అంచనా మేరకు 15 రోజుల వ్యవధిలోనే కందుకూరు మండలంలోని పాలూరు – దొండపాడులో ఏకంగా వందెకరాల్లో తోటలను రైతులు తొలగించారు. గుడ్లూరు మండలం పాజర్లలో తోటల నరికివేత కొనసాగుతోంది. మొద్దులతో సహా తీసి కలప కింద విక్రయిస్తున్నారు.

పురుగొస్తోంది



మామిడికాయలో పురుగొస్తోంది. ఎన్ని మందులు కొట్టినా పోవడం లేదు. పెట్టుబడులు పెరుగుతున్నాయే తప్ప ఆదాయం రావడం లేదు. ఏటా పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. చేసేదేమీ లేక మామిడి తోటను తొలగించాను.

– ఆళ్ల సింగారెడ్డి, రైతు, పాలూరు

అవగాహన సదస్సులు నిర్వహిస్తాం



మామిడి తోటలను తొలగిస్తున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. వందెకరాల్లో తోటలను తొలగించారని అంచనా వేశాం. పెట్టుబడులు పెరగడం.. తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండటంతో తోటలను రైతులు తొలగిస్తున్నారు. మరోసారి అవగాహన సదస్సులను నిర్వహించి రైతులకు వివరిస్తాం. ఫ్రూట్ కవర్లను వాడటం ద్వారా పండు ఈగను ఎదుర్కోవచ్చు.

– బ్రహ్మసాయి, ఉద్యానాధికారి

డీసీసీబీ చైర్మన్, సీఈఓకు అవార్డులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) వజ్రోత్సవ వేడుకలను విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన డీసీసీబీలకు అవార్డులను ప్రదానం చేశారు. సౌత్ కోస్టల్ రీజియన్‌లో బెస్ట్ డీసీసీబీగా నెల్లూరును ఎంపిక చేసి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీఈఓ శంకర్‌బాబుకు అవార్డులను సీఎం చేతుల మీదుగా అందజేశారు. ప్రోత్సాహక బహుమతిగా రూ.1.5 లక్షల చెక్కును డీసీసీబీకి ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అవార్డును ప్రదానం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కాకాణి

ఊరికో పేరు.. ఆపై కుచ్చుటోపీ



అనంతపురం జిల్లా కొప్పలకొండలో మోసగాడి సొంతిల్లు

- ప్రజల అత్యాశే పెట్టుబడి
- పలు జిల్లాల్లో కోట్లలో మోసం
- కేసులు నమోదైనా అరెస్టులేవీ..?



భాస్కర్‌రెడ్డి ఉరఫ్ బెస్త చిన్న ఓబులేసు

ఆత్మకూరు: మనోహర్‌రెడ్డి.. భాస్కర్‌రెడ్డి.. గోవర్ధన్‌రెడ్డి.. ఇలా ఊరికో పేరు.. మాయమాటలు చెప్పి రూ.కోట్లు దండుకొని ఉడాయించడం ఈయన పరిపాటి. ఎక్కడ పాగా వేసినా మూడు కోట్లకు తక్కువ కాకుండా వసూలు చేసి నమ్మిన వారి నెత్తిన కుచ్చుటోపి పెట్టి ఉడాయిస్తున్న వ్యక్తి వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది.

పలు స్టేషన్లలో కేసులు

ఇలా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అసలు పేరు బెస్త చిన్న ఓబులేసు. అనంతపురం జిల్లా పెనుకొండ, కణేకల్లు, నంద్యాల జిల్లా అవుకు, సత్యసాయి జిల్లా సోమందేపల్లి, జిల్లాలోని ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్లలో అతనిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే అనంతపురం జిల్లా కణేకల్లులో పోలీసులు అరెస్ట్ చేయగా, కొద్ది రోజులకే బెయిల్‌పై బయటకొచ్చి మోసాలకు పాల్పడటమే వృత్తిగా ఎంచుకున్నారు.

జల్సాలు..

మోసగించగా వచ్చిన డబ్బుతో గోవా, ముంబై, తదితర ప్రాంతాలకెళ్లి జల్సాలు చేయడం ఈ మోసగాడి నైజం. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన చిన్న ఓబులేసు గతంలో రైల్వే కమ్ములు చోరీ కేసులో నిందితుడిగా ఉన్నారు. నగదుతో జల్సాలు పూర్తి చేసుకొని వచ్చేటప్పుడు గుండుతో గ్రామంలో ప్రత్యక్షం కావడం రివాజు. గతంలో పోలీసులకు సైతం ఇదే రీతిలో పట్టుబడ్డారు.

మోసాల చిట్టా..

సోమందేపల్లిలో రూ.2.5 కోట్లు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో సుమారు రూ.10 కోట్లు, జిల్లాలోని ఆత్మకూరులో సుమారు రూ.నాలుగు కోట్ల మోసం చేసిన ఈయన బుచ్చిరెడ్డిపాళెంలో మూడు నెలల క్రితం ఓ ఆఫీస్‌ను తెరిచారు. అయితే పాచిక పారకపోవడంతో అక్కడి నుంచి ఉడాయించారు. ఈయన భార్య, బావమరిది తెరవెనుక ఉండి నాటకాలు సాగిస్తున్నారు. ఈయన ఫొటోలు సైతం అందుబాటులో ఉన్నా.. స్వగ్రామమైన కొప్పలకొండలో పెద్ద ఇల్లు ఉన్నా పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులను సైతం మేనేజ్ చేయడం ఈయన నైజమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డిని సంప్రదించగా, పలుచోట్ల భాస్కర్‌రెడ్డి మోసాలకు పాల్పడిన విషయం వాస్తవమేనన్నారు. ఈయన్ను పట్టుకునేందుకు ఎస్సై ముత్యాలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

ఆత్మకూరొచ్చి.. నట్టేట ముంచి

సిగరెట్లు, చక్కెర ఎగుమతి.. దిగుమతి వ్యాపారం చేస్తుంటానని నమ్మబలికి ఆత్మకూరు పరిధిలోని నెల్లూరుపాళెంలో భాస్కర్‌రెడ్డి పేరుతో ఓ ఇంట్లో అద్దెకు దిగారు. అద్దె కార్లను తన సొంత వాహనాలుగా చెప్పుకొంటూ హడావుడి చేశారు. కోట్లలో వ్యాపారం చేస్తున్నారని చుట్టుపక్కలవారూ నమ్మారు. ఇదే అదునుగా భాస్కర్‌రెడ్డి పేరుతో చెలామణి అవుతున్న చిన్న ఓబులేసు తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే లక్షకు రోజూ రూ.1500 చొప్పున వడ్డీ చెల్లిస్తానని నమ్మబలికారు. దీంతో సుమారు రూ.నాలుగు కోట్లను 11 మంది చెల్లించారు. ఇంటిని అద్దెకిచ్చిన మక్కెన రోశయ్య నిత్యం టిఫిన్లు, భోజనాలను తన ఇంటి నుంచే సరఫరా చేసేవారు. ఈయన వద్ద రూ.1.5 కోట్లను వసూలు చేశారు. సమీపంలోని గ్రామాల్లో తన పొలాన్ని మాదాల విష్ణు విక్రయించగా, వచ్చిన నగదులో రూ.కోటిని మోసగాడి వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టారు. ఇదే అదునుగా గత నెల 22న నెల్లూరుపాళెం నుంచి మోసగాడు ఉడాయించారు. నెల్లూరుపాళేనికి చెందిన చెరుకూరి కామాక్షయ్య, సన్నిబోయిన ప్రభాకర్, ఈదల సురేష్, ప్రసాద్, ఖాజారహంతుల్లా, బొబ్బల రాజా, పుచ్చకట్ల రమణయ్య, మాదాల కృష్ణయ్య, ముక్కాల శ్రీనివాసులు.. ఇలా 11 మంది పెట్టుబడులు పెట్టి మోసపోయామంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల ఆదేశాల మేరకు నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో సీనియర్ రెసిడెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల్లో తాత్కాలిక పద్ధతిన ఏడాది కాలానికి పనిచేసేందుకు అర్హులైన వారు ఈ నెల 7న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటలలోపు వాక్ఇన్ ఇంటర్వ్యూ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు, ఇతర వివరాలకు spsnellore.ap.gov.in వెబ్సైట్ను సంప్రదించాలని సూచించారు.

జెడ్పీ సీఈఓ చిరంజీవికి మాతృవియోగం



ఆదిలక్ష్మమ్మ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న అరుణమ్మ దంపతులు

సంగం: జిల్లా జెడ్పీ సీఈఓ భూపతి చిరంజీవి తల్లి ఆదిలక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందారు. ఉడ్హౌస్పేటలోని స్వగృహంలో ఆదిలక్ష్మమ్మ పార్థీవదేహాన్ని జెడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ ఆనం విజయ్కుమార్రెడ్డి, తదితర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.


మాజీ ముతవళికి కోర్టులో చుక్కెదురు

అనుమసముద్రంపేట: ఏఎస్పేటలోని హజరత్ ఖాజానాయబ్రసూల్ దర్గా మాజీ ముతవళి హఫీజ్ పాషా వేసిన పిటిషన్ను రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఏఎస్పేట దర్గా హుండీల బాధ్యత వక్ఫ్బోర్డుకు కాకుండా, తనకు అప్పగించాలంటూ ఈ ఏడాది ఏప్రిల్ 18న హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత హైకోర్టు ధర్మాసనం మాజీ ముతవళి పిటిషన్ను సస్పెండ్ చేసింది.

చారిత్రక సంపదను పరిరక్షించాలి

కందుకూరు: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా జరుపుతున్న తవ్వకాల్లో వలేటివారిపాళెం వద్ద గురువారం బయల్పడిన విగ్రహం బౌద్ధహస్త సాముద్రిక చిహ్నాలను పోలి ఉందని ప్రముఖ ఉపాసకులు గాంధ్ల హరిప్రసాద్ బోధి, ముప్పవరపు కిశోర్ తెలిపారు. ఈ విగ్రహాన్ని పరిశీలించి చారిత్రక నేపథ్యాన్ని నిర్ధారించేందుకు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, విద్వాన్జ్యోతి చంద్రమౌళిని సంప్రదిస్తున్నట్లు చెప్పారు. విగ్రహం బయటపడిన ప్రాంతంలో రావిచెట్టు ఆనవాళ్లు ఉండడం, గతంలో ఈ ప్రాంతంలో బుద్ధుని బోధనలు వ్యాప్తి చెంది ఉండవచ్చునన్నారు. ఈ అమూల్య సంపదను ప్రభుత్వ ఉన్నతాధికారులు భద్రపరచాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): పదోన్నతులు, బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీ అయిన గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ఉద్యోగం పొందినప్పటి నుంచి నేటి వరకు జీతాలు చెల్లించలేదన్నారు. జీతాలు రాక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతిశర్మ, కోశాధికారి మురళీధరరావు, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అచ్చయ్య, విజయకుమారి, కార్యదర్శులు నాగిరెడ్డి, సురేంద్రబాబు, ఖాజావలి, దయాకర్, శ్రవణ్కుమార్, సురేంద్రబాబు, రాష్ట్ర కౌన్సిలర్లు తులసీరాంబాబు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

టమాటాల కోసం బారులు

టమాటా ధరలు కొండెక్కి కూర్చోవడంతో ప్రభుత్వం రైతు బజార్లలో సబ్సిడీపై విక్రయిస్తోంది. నెల్లూరులోని నవాబుపేట రైతు బజార్లో శుక్రవారం స్టాల్ను ఏర్పాటు చేయగా వినియోగదారులు భారీగా తరలివచ్చి బారులుతీరారు. మార్కెటింగ్ సిబ్బంది వినియోగదారుల వేలిపై సిరా గుర్తు వేసి టమాటాలు అందజేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సబ్సిడీ టమాటాల కొనుగోలుకు బారులు తీరిన వినియోగదారులు



వినియోగదారుల వేలిపై బ్లాక్ మార్క్ వేస్తున్న సిబ్బంది



భారీగా వినియోగదారులు తరలిరావడంతో గేటు మూసివేసిన దృశ్యం

బాబు బతుకంతా కుట్రలు, కుతంత్రాలే

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్రెడ్డి

కోవూరు : చంద్రబాబు బతుకంతా కుట్రలు, కుతంత్రాలేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి విమర్శించారు. కోవూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడానికే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను గద్దెనెక్కాక ఆయన నెరవేర్చలేదన్నారు. బాబు పాలనలో అష్టకష్టాలను ఎదుర్కొన్న ప్రజలు 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్రెడ్డికి పట్టాభిషేకం చేశారన్నారు. వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండడాన్ని చూసి ఓర్వలేక ఎన్నికలకు ఏడాది ముందే మళ్లీ కొత్త డ్రామాలతో చంద్రబాబు ప్రజల మధ్యకు వస్తున్నారన్నారు. రెండ్రోజుల క్రితం కదిరి బహిరంగ సభలో ఆయన నోటికి అడ్డూ అదుపు లేకుండా పిచ్చిపట్టినట్లుగా మాట్లాడారని గుర్తుచేశారు. పిచ్చోడి చేతిలో రాష్ట్రం అని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అధికార దాహంతో పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తోంది ఆయనేనన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. అధికారం లేకపోతే చంద్రబాబు ఉండలేరన్నారు. నిత్యం అధికార అహంకారంతో ఉండే చంద్రబాబును ప్రజలు జీవితంలో ఆశీర్వదించరన్నారు. సంక్షేమ పాలనతో సీఎం వైఎస్ జగన్కు మంచిపేరు రావడాన్ని చూసి తట్టుకోలేక నిద్రలేస్తే ఎల్లో మీడియా ద్వారా విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమకు రాజకీయ భవిష్యత్తు లేదని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్కు తెలిసినప్పటికీ ఉనికిని కాపాడుకునేందుకు ఎన్నో కుట్రలు పన్నుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలన్నారు. డీఏబీ చైర్మన్ నిరంజన్బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్కుమార్రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ పార్వతి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, వైస్ఎంపీపీ నర్సింహులురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి రూ.1.50 కోట్లతో టెండర్లు

- నెల్లూరు నగర ఎమ్మెల్యే పీ అనిల్కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్కుమార్

నెల్లూరు (స్టోన్హౌస్పేట): బాలాజీనగర్లోని బ్యాంకు కాలనీలోని నాలుగు కూడళ్లల్లోని పార్కు స్థలాల అభివృద్ధికి రూ.1.50 కోట్లతో టెండర్లు పిలిచామని నగర ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్ తెలిపారు. నగరంలోని 13వ డివిజన్, బాలాజీనగర్లోని బ్యాంకు కాలనీలో రూ.35 లక్షలతో చేపడుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ బ్యాంకు కాలనీవాసులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రతి డివిజన్కు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు డ్రెయిన్ల నిర్మాణానికి అదనంగా ఇచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వంలో నామమాత్రంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారని విమర్శించారు. నగర నియోజకవర్గంలో మరో రూ.16 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. నగరంలోని పార్కు స్థలాలను ఉపయోగంలోకి తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే 13వ డివిజన్లోని యలమవారిదిన్నె, బలిజపాళెంలోని పార్కులను పూర్తి చేశామన్నారు. మిట్టపాళెంలోని పార్కును పూర్తి చేయనున్నామన్నారు. 2017లో స్థానిక డివిజన్కు సంబంధించి 18 ఎకరాలను బ్లాక్లిస్ట్లో ఉంచారని తెలిపారు. ఈ ప్రాంతంలో నివశిస్తున్న అనేక మంది పిల్లల చదువుల లోన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతుండగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బ్లాక్లిస్ట్ నుంచి తొలగించాలని కోరామన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి లేఖ పంపుతామని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ లేఖ పంపగానే ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డితో మాట్లాడి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న మెప్మా ఎండీ విజయలక్ష్మి

- నెల్లూరులో రెండు జగనన్న మహిళా మార్టులు
- తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు
- మెప్మా ఎండీ విజయలక్ష్మి

నెల్లూరు(పొగతోట): పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి, సుస్థిర జీవనోపాధుల కల్పనకు సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని మెప్మా డైరెక్టర్ వీ విజయలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జగనన్న మహిళా మార్టులపై మెప్మా సిబ్బంది, ఆర్పీలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మెప్మా మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో పొదుపు మహిళల భాగస్వామ్యంతో జగనన్న మహిళా మార్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 9 మార్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కో పొదుపు మహిళతో రూ.150 పెట్టుబడిగా పెట్టించి మార్టులను ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోందన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా మహిళ మార్టులు, ఆహార క్యాంటీన్లు, ఈ మార్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జగనన్న మహిళ మార్టుల్లో పొదుపు మహిళలందరూ ప్రతి నెలా నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తే కోట్లల్లో వ్యాపారం సాగుతుందన్నారు. నెల్లూరు నగర, రూరల్ ప్రాంతాల్లో 80 వేల మందికిపైగా పొదుపు మహిళలు ఉన్నారన్నారు. వారిలో 20 వేల మంది ప్రతి నెలా రూ.1000కు సరుకులు కొనుగోలు చేసినా నెలకు రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతుందన్నారు. ఏడాదికి రూ.24 కోట్ల వ్యాపారం సాగుతుందన్నారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని పొదుపు మహిళలు పంచుకోవచ్చని తెలిపారు. జగనన్న మహిళా మార్టుల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తక్కువ ధరలకే విక్రయిస్తామని చెప్పారు. నగరంలో వచ్చే నెలలో రెండు జగనన్న మహిళా మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మార్టుల నిర్వహణకు నాలుగు కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జగనన్న మహిళ మార్టులను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎండీని మెప్మా సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా రాష్ట్ర అధికారులు శ్రీనివాసులు, రమేష్, ఆదినారాయణ, నెల్లూరు పీడీ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమలులో ఏపీ 30 పోలీసు యాక్ట్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో శనివారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఏపీ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్ అమలులో ఉన్న దృష్ట్యా బహిరంగసభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 25
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ. 5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్లెస్	: 240
లేయర్ చికెన్	: 150

దూబగుంటలో వ్యక్తి దారుణహత్య



శ్రీనివాసులు మృతదేహం,



శ్రీనివాసులు (ఫైల్)

అనుమసముద్రంపేట: మండలంలోని దూబగుంటలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల మేరకు..వింజమూరుకు చెందిన సానా శ్రీనివాసులు (50) గత కొన్నేళ్ల క్రితం దూబగుంటకు చెందిన ఈశ్వరమ్మను పెళ్లి చేసుకుని అత్తగారి ఊర్లోనే స్థిరపడ్డాడు. రోజూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత మూడు నెలల క్రితం పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన కాశీవిశ్వనాథం దూబగుంటలో పొలాలు కొనుగోలు చేసి ఇక్కడే ఉంటున్నాడు. ఆయన దగ్గరకు శ్రీనివాసులు రోజూ కూలి పనులకు వెళ్లేవాడు. గత రెండ్రోజుల క్రితం పొలంలో పని చేస్తున్న సమయంలో శ్రీనివాసులు మరో కూలి ఖాజావలి మధ్యన చిన్నపాటి విషయమై వివాదం నెలకొంది. ఈ క్రమంలో శ్రీనివాసులు తలను ఖాజావలి పగులగొట్టాడు. ఈ విషయమై రాజీ కుదిర్చేందుకు గ్రామంలోని రచ్చబండ వద్దకు రావాలని కాశీవిశ్వనాథం పిలవడంతో ఇద్దరూ అక్కడకు చేరుకున్నారు. అయితే మధ్యవర్తిత్వం జరగకముందే కాశీవిశ్వనాథ్, శ్రీనివాసులు నడుమ మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో కాశీవిశ్వనాథ్ తన దగ్గరున్న కత్తితో శ్రీనివాసులను పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కాశీవిశ్వనాథ్ స్వయంగా పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.